సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

గ్రీన్ దీపావళిపై చిత్ర లేఖన పోటీలు



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

మద్దిలపాలెం : గ్రీన్ దీపావళితో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ సహాయ కోశాధికారి పద్మజా అన్నారు. గురువారం హెచ్‌బీ కాలనీలో స్కూల్‌లో విద్యార్థులకు గ్రీన్ దీపావళి అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించి, విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీక్యాప్ మాజీ చైర్‌పర్సన్ అమ్మాయి, కార్యదర్శి రేణుకా, తదితరులు పాల్గొన్నారు.

525 మంది టీచర్లకు శిక్షణ

బీచ్ రోడ్డు: సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఆర్థిక అక్షరాస్యతలో నైపుణ్యత పెంచేందుకు సీఖో పైసో కి భాషా పేరుతో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కోటక్ మ్యూచువల్ ఫండ్ డిజిటల్ బిజినెస్ హెడ్ కింజల్ షా తెలిపారు. సిఖో పైసో కి భాషా కార్యక్రమం వివరాలను ఆయన గురువారం మీడియాకు వివరించారు. దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టత కోసం ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు ఆర్థిక అంశాలను బోధించేందుకు ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 1050 మంది ఉపాధ్యాయులకు అవగాహన కల్పించగా.. వారిలో 525 మంది విశాఖ ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ వాలీ స్కూల్ ప్రిన్సిపల్ ఈశ్వరి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా లడ్డూ మిక్సింగ్



లడ్డూ మిక్సింగ్‌ను పరిశీలిస్తున్న ప్రభుకిషోర్

బీచ్ రోడ్డు: దీపావళి సందర్భంగా నొవొటల్‌లో ఏర్పాటు చేసిన లడ్డూ మిక్సింగ్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. గురువారం ఏర్పాటు చేసిన ఈ లడ్డూ మిక్సింగ్ కార్యక్రమాన్ని వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి సందర్భంగా ప్రతి ఏటా ఈ లడ్డూ మిక్సింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హోటల్‌లో ఉండే అతిథులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా



స్టాల్ టోకెన్ అందిస్తున్న యాసిన్

సీతమ్మధార: రైతుబజార్‌లో నాణ్యమైన సరకులు విక్రయించాలని జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ సూచించారు. గురువారం ఆయన పర్యవేక్షణలో సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు డ్రా తీసి రైతులకు కేటాయించారు. ఈ సందర్భంగా యాసిన్ మాట్లాడుతూ వినియోగదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని, బోర్డుపై ఉన్న ధరలకే కూరగాయలు, ఇతర సరకులు విక్రయించాలని వ్యాపారులకు సూచించారు. కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

20 మంది మందుబాబులకు జరిమానా

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందిని ఐదో స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా.. ఒక్కొక్కరికీ రూ.4 వేల నుంచి రూ.9 వేల వరకు జరిమానాలు విధించినట్లు పోలీసులు తెలిపారు. మొత్తం 20 మందికి రూ.1.42 లక్షలు ఫైన్ వేశారు. ఆరిలోవ, నెహ్రూ నగర్‌కు చెందిన వాసు(ఆటో =39 యూజే 4132)కు ఎనిమిది రోజుల జైలు శిక్ష విధించారు. శివాజీపాలేనికి చెందిన వంగర సతీష్ దొర(ఆటో-ఏపీ39 యూఎం 9710)కు ఏడు రోజులు జైలు శిక్ష విధించారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
7331119904, 9912440606

అందరికీ సంక్షేమం

- అందుకే ఏపీకి జగన్ అవసరం
- వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ



సభలో పాల్గొన్న ప్రజలు

ఆరిలోవ: పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అవసరం రాష్ట్రానికి ఉందని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 12వ వార్డులో గురువారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన ముందుగా పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లుగా ప్రజల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేసి ఆర్థికాభ్యున్నతికి తోడ్పాటు అందించారన్నారు. పేద విద్యార్థుల కోసం జగనన్న అమ్మఒడి, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ కానుక, రైతుల కోసం వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల బీమా, వైఎస్సార్ మత్స్యకార బీమాతో పాటు వైఎస్సార్ చేయూత, పెన్షన్ కానుక, కాపు నేస్తం, సున్నా వడ్డీ, జగనన్న తోడు, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, జగనన్న చేదోడు, వైఎస్సార్ కంటి వెలుగు, జగనన్న గోరు ముద్ద, ఇంటింటికి రేషన్, వైఎస్సార్ సంపూర్ణ పోషణ తదితర పథకాలతో ప్రజలు ఎంతో లబ్ధిపొందారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ సరకుల కోసం దూరంగా ఉన్న రేషన్ షాపునకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు ఇంటి వద్దకే వచ్చి సరకులు అందిస్తున్నారన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఇంటి వద్దకే వచ్చి ప్రతి నెలా పింఛన్ అందిస్తూ వారికి భరోసా కల్పిస్తున్నారన్నారు. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నవారు అధికారంలోకి వస్తే ఇవన్నీ ఆపేస్తామని అంటున్నారని ఎంపీ చెప్పారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి కొనసాగాలంటే ఆంధ్రప్రదేశ్‌కు జగన్ అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, ఏపీ మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, వైఎస్సార్ సీపీ నగర మహిళా అధ్యక్షురాలు నల్ల కృపాజ్యోతి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

18వ వార్డులో..

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వార్డులో గడప గడపకు వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి ప్రజారంజక పరిపాలనను మరోసారి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, వార్డు కార్పొరేటర్లు, పార్టీ వార్డు అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.



12వ వార్డులో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

కచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించాలి

- సమీక్షలో జేసీ విశ్వనాథన్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ కేఎస్ విశ్వనాథన్

కొమ్మాది: తప్పులు లేని కచ్చితమైన ఓటరు జాబితా రూపొందించడం లక్ష్యం కావాలని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా డూప్లికేట్ ఓట్లు తొలగించే క్రమంలో జాగ్రత్త వహించాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ సూచించారు. బీచ్‌రోడ్డు రుషికొండలో గల ఏ1 గ్రాండ్‌లో భీమిలి, విశాఖ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల ముసాయిదా జాబితాపై ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లతో గురువారం ఉదయం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్ ప్రకారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒకరి పేరు మీద రెండు ఓట్లు ఉన్నా బీఎల్‌వోలు స్వయంగా ఆయా ఇళ్లకు వెళ్లి పరిశీలించాలని, డూప్లికేట్ ఓట్ల తొలగింపులో సంబంధిత ఓటరు నుంచి సమ్మతి తీసుకోవాలని స్పష్టం చేశారు. చిరునామా మారినా, వలస వెళ్లిపోయినా వారి వివరాలు కచ్చితంగా తెలుసుకోవాలని, అనంతరం తదుపరి చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. బీఎల్‌వోలు ఓటు సవరణను ఈఆర్‌వో 2.0 ద్వారా ఆన్‌లైన్‌లో తప్పక అప్‌లోడ్ చేయాలన్నారు. ఒకే ఇంటిలో పది మంది కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్నవి, వంద సంవత్సరాలు పైబడిన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓట్ల జాబితా సవరణలో డూప్లికేటు తొలగింపులో అనుసరించాల్సిన నిబంధనలు వివరించారు. ఎన్నికల కమిషన్ నియమావళిని అందరూ తప్పకుండా పాటించాలని తెలిపారు. సమావేశంలో వీఆర్‌వో కె.మోహన్ కుమార్, ఆర్‌డీవో భాస్కర్‌రెడ్డి, ఉప తహసీల్దార్ రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

12వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



పెదగదిలి కొండవాలులో మహిళతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ స్థానిక కార్పొరేటర్ అక్కరమాని రోహిణితో కలసి వార్డులో పెదగదిలి, సాలిపేట, చినగదిలి ప్రాంతాల కొండవాలులో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు నుంచి పొందిన లబ్ధి గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా సచివాలయంలో సిబ్బందికి తెలియజేయాలన్నారు. సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన పత్రాలను ఎంపీ ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంతో ప్రజలకు చేరువ



9వ వార్డులో అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్ గొలగాని, ఎంపీ ఎంవీవీ



28వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న మేయర్ గొలగాని, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

- ఎంపీ ఎంవీవీ, మేయర్ గొలగాని
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆరిలోవ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలకు చేరువయ్యారని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 9వ వార్డులో గురువారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలకు స్థానిక కార్పొరేటర్ స్వాతితో కలిసి మేయర్, ఎంపీ శంకుస్థాపన చేశారు. షిర్డీ సాయి వెటర్నరీ కాలనీలో రూ.85 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులు, సంజయ్‌గాంధీ కాలనీలో రూ.37.46 లక్షలతో సామాజిక భవన నిర్మాణం, హనుమంతవాక కూడలి నుంచి సింహగిరి కాలనీ వరకు రూ.48.71 లక్షలతో కాలువల నిర్మాణం, మరమ్మతులు, కైలాసగిరి బీచ్ వద్ద రూ.37.90 లక్షలతో బస్ షెల్టరు నిర్మాణం కోసం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్, ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విశాఖ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. వార్డుల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. 9వ వార్డులో సుమారు రూ.2 కోట్లతో గురువారం పనులు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఇంజినీర్లు, సిబ్బంది, రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు మోహన్‌రెడ్డి, కళావతి, నాగేశ్వరరావు, భీమారావు, తదితరులు పాల్గొన్నారు.

రూ.87.37 లక్షలతో పార్కు ఆధునికీకరణ

బీచ్ రోడ్డు: నగరంలో ప్రజల ఆహ్లాదం కోసం పార్కులను అభివృద్ధి చేస్తున్నట్టు మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. గురువారం జీవీఎంసీ 28వ వార్డు నెహ్రూనగర్ గ్రంథాలయం పార్కు ఆధునికీకరణ పనులకు ఎంపీ ఎంవీవీతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు రూ.87.37 లక్షల వ్యయంతో పార్కు ఆధునికీకరణతో పాటు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. పార్కు పనులను త్వరితగతిన పూర్తి చేసి నిర్ణీత సమయంలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జీవీఎంసీ అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, సంతోష్ కుమారి, డి.సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లా దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట చర్యలతోనే రైల్వే భద్రత



సెమినార్‌లో మాట్లాడుతున్న కె.సి.జేమ్స్

కంచరపాలెం: రైల్వే భద్రత అంశాలపై ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్(ఏఐఎల్ఆర్ఎస్ఏ) ఆధ్వర్యంలో గురువారం కంచరపాలెం బొట్టా నర్సింగరావు భవనంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.సి.జేమ్స్ మాట్లాడుతూ ఇటీవల కేపీఎల్-ఏఎల్ఎం సెక్షన్ మధ్య పలాస-రాయగడ ప్యాసింజర్‌లు ఢీకొన్న సంఘటన అత్యంత దురదృష్టకరమన్నారు. ఈ విషాద ఘటన తర్వాత రైల్వేలో భద్రత అనేది ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన రైల్వే ఉద్యోగులతో పాటు ప్రయాణికులకు సంతాపాన్ని తెలియజేశారు. ప్రమాదానికి గల కారణాలేమిటో కాకుండా.. ఎవరు బాధ్యులన్న ఉద్దేశంతో రైల్వే అధికారులు ప్రమాదాలపై ఆరా తీస్తున్నారన్నారు. జోనల్ అధ్యక్షుడు ఎస్.కె.చౌబే, కార్యదర్శి బోలేనాథ్ మాట్లాడుతూ సేఫ్టీ కేటగిరీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోవడంతో సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతోందన్నారు. రైళ్లను సురక్షితంగా నడిపేందుకు రైల్వే యంత్రాంగం, ప్రభుత్వం వెంటనే పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కుమార్, జగన్, పబ్లిక్ సెక్టార్ కన్వీనర్ ఎం.శ్రీనివాస్, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల కన్వీనర్ రెడ్డి వెంకటరావు, ఏఐఎల్ఆర్ఎస్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.వి.ఎస్.రాజు ప్రసంగించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చిన్నోడు, పాణిగ్రాహి, హరికృష్ణ, సంతోష్, ఇంద్రజిత్ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై ట్రాఫిక్ పోలీస్ అవుట్ పోస్ట్ కేంద్రం



ట్రాఫిక్ పోలీస్ అవుట్ పోస్టు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, సీఐ అశోక్‌కుమార్, తదితరులు

సింహాచలం: సింహగిరిపై ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీస్ అవుట్ పోస్టు కేంద్రాన్ని గురువారం సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ సింహగిరిపై మే ఐ హెల్ప్ యు కేంద్రానికి సమీపంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం నుంచి మైకు ద్వారా వాహనాల నియంత్రణ, పార్కింగ్ ప్రదేశాలు, తదితర అంశాలను భక్తులకు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్, దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, ముదుండి రాజేశ్వరి, దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

నేడు జాతీయ ఆయుర్వేద దినోత్సవం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఆయుష్ మంత్రిత్వ శాఖ ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నవంబర్ 10న నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. దీనిలో భాగంగా శుక్రవారం ఔషధ మొక్కలు నాటే కార్యక్రమం, ప్రత్యేక ప్రసంగాలు, విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు.

మైక్రోప్లాస్టిక్స్‌పై శిక్షణ తరగతులు ప్రారంభం



సదస్సును ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగం ఆధ్వర్యంలో 'మైక్రో ప్లాస్టిక్స్ ఇన్ మెరైన్ ఎన్విరాన్‌మెంట్-అనాలసిస్ మిటిగేషన్, మేనేజ్‌మెంట్'అంశంపై నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ తరగతులను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్ గురువారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మానవాళి మనుగడకు సముద్ర వ్యవస్థ ఎంతగానో దోహదపడుతోందన్నారు. దీనిని పరిగణనలోకి తీసుకుని సముద్ర కాలుష్యం నియంత్రించడం ఎంతో అవసరమన్నారు. మెరైన్ వ్యవస్థను ప్లాస్టిక్ కాలుష్యం నుంచి పరిరక్షించాల్సిన బాధ్యత తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్, డాక్టర్ కె.ఉమాదేవి, ఆచార్య కె.వి.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కారా మాస్టారుకు ఘన నివాళి



కాళీపట్నం రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: తెలుగు విభాగం ఆధ్వర్యంలో కళాప్రపూర్ణ కాళీపట్నం రామారావు(కారా) మాస్టారు జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కారా మాస్టారు చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు విభాగాధిపతి ఆచార్య జర్ర అప్పారావు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో నరసింహారావు మాట్లాడుతూ కారా మాస్టారు కథల్లో సంఘ సంస్కరణ దృక్పథం ఉందన్నారు. ఆయన రాసిన ప్రతి కథ సామాజిక దృక్కోణంలో ఆవిష్కరించినదేనని, అందుకే కారా కథలు సాహిత్యంలో అజరామంగా నిలిచాయన్నారు. కారా రాసిన యజ్ఞం కథ సాహిత్యంలో ఆయనను చిరస్థాయిగా నిలిపిందని, ఆ రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం గొప్ప విషయమన్నారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ కారా ప్రతిభాపాటవాలను గుర్తించి తెలుగు విశ్వవిద్యాలయం, గీతం విశ్వవిద్యాలయాలు కళా ప్రపూర్ణ బిరుదుతో సత్కరించాయన్నారు. 50 కి పైగా కథలు రాసి తెలుగు కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఆచార్యులు ఎ.సీతారత్నం, డా ఎ.ఈశ్వరమ్మ, బూసి వెంకటస్వామి, విభాగ ఆచార్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మాక్ పోలింగ్



పోలింగ్ బూత్‌లో ఓటర్‌కు స్లిప్ అందజేస్తున్న ఎన్నికల సిబ్బంది



ఓటును బాక్సులో వేస్తున్న ఓటరు

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బంది, ఓటర్లు హడావిడి చేశారు. విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించడానికి ఇక్కడ హైస్కూల్‌లో హెచ్‌ఎం, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ పోలింగ్‌లో ఓటర్లు, ఎన్నికల సిబ్బంది పాత్రను విద్యార్థులే పోషించారు. ఓటర్ జాబితా పరిశీలన, అందులో ఓటరుకు స్లిప్‌ల పంపిణీ, ఆ స్లిప్‌ల ప్రకారం బూత్‌లలో ఓటు వేశారు. విద్యార్థులే పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహించారు. ఓటరుకు బ్యాలెట్ పేపర్లు మడత పెట్టి ఇవ్వడం, చూపుడు వేలిపై ఇంక్ చుక్కలు రాయడం, రహస్య ఓటును బ్యాలెట్ బాక్స్‌లో వేసే విధానం క్రమ పద్ధతిలో జరిగింది. ఈ ప్రక్రియలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఉద్యోగార్థులకు క్విజ్ పోటీలు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం ఉద్యోగార్థులకు పోటీ పరీక్షల నమూనా క్విజ్ పోటీలు జరిగాయి. గ్రంథాలయ సభ్యులు, బీవీకే, ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థులు 60 మంది పాల్గొన్నారు. వర్తమాన అంశాలు, చరిత్ర, ఆర్థిక విజ్ఞాన శాస్త్రం, భూగోళ శాస్త్రం, రాజ్యాంగం తదితర అంశాలపై 8 వృత్తాల్లో 60 వరకు ప్రశ్నలు అడిగారు. లైబ్రేరియన్ దుర్గారాణి మాట్లాడుతూ ఈ పోటీల్లో విజేతలకు ఈ నెల 14న జరిగే గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవంలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఇటువంటి క్విజ్ పోటీలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విజేతలను ఆయా కళాశాలల అధ్యాపకులు అభినందించారు. పోటీలకు డాక్టర్ డి.వి. సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు.

15 కిలోల గంజాయి స్వాధీనం



పోలీసుల అదుపులో గంజాయితో నిందితుడు

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ద్వారకా పోలీసులకు అప్పగించారు. వివరాలిలా.. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని రామాటాకీస్ రోడ్డులో గల ప్రభుత్వ కంటి ఆస్పత్రి సమీపంలో గుజరాత్‌కు చెందిన రాహుల్ షీబా బృందబాన్.. ఒడిశాలోని బరంపురాని చెందిన దీపక్ వద్ద గంజాయి కొనుగోలు చేసి కేరళకు తరలించేందుకు విశాఖ రామాటాకీస్ వద్ద అనుమానస్పదంగా కనిపించడంతో అటువైపు వెళ్తున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో సిబ్బంది అతడి వివరాలు సేకరించారు. బ్యాగులు తనిఖీ చేయగా.. 15 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించిన పోలీసులు దాంతోపాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ద్వారకా పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

4 కేజీల గంజాయి పట్టివేత

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తుల నుంచి నాలుగు కేజీల గంజాయి పట్టుకున్న ఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కేరళ రాష్ట్రానికి చెందిన అఖిల్ బాబు, స్టాన్యుయల్ పీటర్ కలిసి కేరళ వెళ్లేందుకు రైలు ఎక్కడానికి వెళ్తున్న క్రమంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సమాచారం తెలుసుకుని వారిని జ్ఞానాపురం రైల్వే స్టేషన్ సమీపంలో పట్టుకున్నారు. వారి వద్ద నుంచి నాలుగు కేజీల గంజాయి, ఒక సెల్‌ఫోను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని కంచరపాలెం పోలీసులకు అప్పగించారు. సీఐ ఎన్.సాయి కేసు నమోదు చేసి ఇద్దరిని గురువారం రిమాండ్‌కు తరలించారు.

డిసెంబర్‌లో కోటి ఒత్తుల దీపోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సౌర్య పీఠాధిపతి ప్రభాకర్ యోగి

సింహాచలం: విరాట్ హిందూ సంఘ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 8,9,10 తేదీల్లో సింహాచలంలో కోటి ఒత్తుల దీపోత్సవాలు నిర్వహిస్తునట్టు విశాఖకు చెందిన హిమాలయ సౌర్య పీఠాధిపతి ప్రభాకర్ యోగి తెలిపారు. సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా వద్ద కార్యక్రమాల వివరాల కరపత్రాన్ని ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రభాకర్‌యోగి మాట్లాడుతూ సర్వజనులు సుఖశాంతులతో ఉండాలన్నా...ఆనందంతో జీవించాలన్నా సనాతన ధర్మం ఒక్కటే మార్గమని తెలిపారు. సనాతన భారతీయ ధర్మాన్ని రక్షించుకునే క్రమంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా వద్ద, హవేలీ గ్రౌండ్‌వద్ద, వరాహపుష్కరిణి వద్ద కోటి ఒత్తుల దీపోత్సవ మహోత్సవాలను నిర్వహించనున్నట్టు చెప్పారు. డిసెంబర్ 8న నగరంలోని జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయం నుంచి సింహాచలంలోని తొలిపావంచా వరకు భారీ ఎత్తున భారీకలశ యాత్ర నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో విరాట్ హిందూ సంఘ్ ప్రతినిధిలు మీసాల రవీంద్ర, పూడిపెద్ది శర్మ, నమ్మి రాజగోపాల్, భీశెట్టి నాగభూషణం, కాళ్ల జగన్‌మోహన్, ఆర్.జయరాజ్, బూరాడ సాయి రోజా, జ్యోతి, రాధిక పాల్గొన్నారు.

జిల్లా ప్రగతిపై సదస్సు నేడు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఏయూ అలుమ్ని హాలులో 'ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి-విశాఖపట్నం జిల్లా ప్రగతి'అనే అంశంపై సదస్సు జరగనుంది. వివిధ రంగాల్లో నిష్ణాతులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించనున్నట్టు ఏపీడబ్ల్యూజేఎఫ్ విశాఖ అధ్యక్షుడు పి.నారాయణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా జాతీయ న్యాయ సేవా దినోత్సవం



మాట్లాడుతున్న న్యాయమూర్తి శేషమ్మ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జాతీయ న్యాయసేవా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శేషమ్మ పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. బాలల సంరక్షణ, భద్రతకు 2012లో ఏర్పాటు చేసిన ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్సువల్ అఫెన్సెస్(పోక్సో) చట్టంపై అవగాహన కల్పించారు. చట్టం పరిధి, లక్ష్యాలు వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవ కోసం రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ ఈస్ట్
9912220751, 9010055116
Office mail : sakshiadvtvsp@gmail.com